
# అనూహ్యం

చుక్కారెడ్డి




"ఎంత కావాలన్నావు అన్నయ్యా?" మంజుల వంటింట్లోంచి బయటికి వస్తూ అడిగింది.

సారథి నీరసంగా నవ్వాడు.

"అవి లేకపోయాక ఎంతయితే ఏంలే అమ్మా! ఇప్పుడు ఏమని ప్రయోజనమేమిటి?"

"కాదులే! నేనిస్తాను. ముందు నువ్వెంత కావాలో చెప్పుదూ!" అంది మంజుల సారథి ఎదుట ఉన్న చాపమీద కూర్చుంటూ.

"అయిదొందలమ్మా. ఏంచేస్తే

"అవి కడితే ఉద్యోగం వస్తుందన్నమాట ఖాయమేనా?"

"ఎందుకు రాదూ! విన్నగనక ఉండి ఉంటే ఈ పాటికి చేర్పించేవాణ్ణి. చిన్న దుర్గారావ్ కూడా లేడాయె. ఇవాళ వస్తాడు గావును. కాని అతను వచ్చేదాకా మనకోసమే ఎదురు చూస్తుంటుందా ఉద్యోగం. సమయానికి అన్నీ అలా కలిసివస్తాయి. మేనేజరుతో అంతడబ్బు ఇచ్చుకోలేనని చెప్పి వచ్చేశాను." అన్నాడు సారథి.

మంజుల మాట్లాడలేదు. ఏమిటి కొంగు ముడివిప్పి అయిదువందల రూపాయల నోట్లు తీసి అందించింది.

సారథి ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంతకూ ఇదెక్కడిది?" సందేహంగా అడిగాడు వాటినందుకుంటూ.

మంజుల నవ్వి "చిన్న లలిత దగ్గర తీసుకొచ్చాను. డబ్బు అవసరం ఉంది. అనగానే ఎందుకూ అని అడగకుండా తీసిచ్చింది. లలిత మంచమ్మాయి కదూ అన్నయ్యా!" అంది.

సారథి మాట్లాడలేదు. అడగ్గానే ఎంతంటే అంత ఇస్తున్న లలిత మంచితనం గురించి ఆలోచిస్తున్నాడు. రోజు రోజుకీ ఆమె పట్ల పెరుగుతున్న కృతజ్ఞతా భారంతో క్రుంగి పోతున్నాడు.

"మాట్లాడవేం అన్నయ్యా! లలిత మనింట్లో ఉంటే బాగుండదూ!" మంజుల రెట్టించింది.

"ఎందుకు బాగుండదూ? కాని ఆమెగారేమో తమింటికే రమ్మంటున్నట్టుందామె!" అన్నాడు సారథి నవ్వుతూ.

"ఇప్పుడలాగే అంటుందిలే. ఓ రోజు మనింటికే వస్తానని ప్రాధేయపడక పోతే చూడు సత్యంగారి భోజనానికి లే అన్నయ్యా! కళ్ళు నవ్వుతున్నది." అన్నది మంజుల.

ఆ రెండు గదుల పోర్షన్లో ఇప్పుడు వాళ్ళిద్దరే ఉంటున్నారు. ఏడాది క్రితం వాళ్ళ తండ్రి కూడా ఉండేవాడు. బతికున్నప్పుడు ఆయన బడిపంతులు చేసేవాడు. యావజ్జీవనమూ కృషిచేసి వాళ్ళ కోసం రెండెకరాల పొలం సంపాదించాడు. మంజుల చిన్నతనంలోనే లక్ష్మి చనిపోయింది ఏదో జబ్బుతో తీసుకుని. అప్పటినుంచి వంటా, పిల్లలకి స్నానాలు చేయించటం, అన్నం తినిపించటం లాంటి పనులన్నీ ఒక్కడే చేస్తూ వాళ్ళని పెంచాడు. కూతురు పెళ్ళి చేయాలి అనుకుంటున్న సమయంలోనే ఆయన కన్నుమూశాడు.

ఆయనున్నంత కాలం సారథి నిశ్చింతగా గడిపాడు. ఆయన పోయిన దగ్గరనుంచి ఇల్లు ఎట్లా గడుస్తుందా అనే చింతతో సతమత మవుతున్నాడు. ఉన్న రెండెకరాల మీద వచ్చే ధాన్యం వాళ్ళిద్దరికే సరిపోతుంది. కాని మనుష్యులు బ్రతకటానికి ఒక్క తిండే ప్రధానం కాదుగదా. ఇంటద్దె, బట్టలూ, పైఖర్చులూ, మొదలయిన ఎన్నో అవసరాలు ఏవో వుంటాయి.

మంజుల చదువు మానేసి ఇంటి పట్టునే వుంటోంది. ఆమె పెళ్ళి చేయటం ప్రధాన కర్తవ్యం. పోగా ఇంటి ఖర్చుకే లేని కాలంలో కాని కట్నానికీ పుస్తకాలకీ ఎక్కడున్నుంచి తేగలడు? అది పల్లెటూరు కూడా కాదు. అయ్యో పాపం మంచివారు రామయ్యగారు పోయి ఆయన బిడ్డలు అల్లాడి పోతున్నారు, వాళ్ళ సంసారం పంచిపెట్టాలి అని పదుగురు కట్టే పెద్దమనుష్యులుండటానికి. పక్కింట్లో ఎవరుంటున్నారో తెలియని పట్టణం అది.

ఎన్నో ఆలోచించి ఆఖరు సంవత్సరం బి. కాం. చదువుతున్న సారథి, అంతటితో చదువు ఆపెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. ఏదైనా ఉద్యోగం చేసి చెల్లెలి పెళ్ళి చేసాక తన సంగతి చూసుకో వచ్చునని అతని అభిప్రాయం. అని ఆయా విఘ్నయణ

